క్లుప్తంగా

మెరుగైన వైద్య సేవలందించాలి


మొక్కలు నాటుతున్న దృశ్యం

గోస్పాడు: క్షేత్రస్థాయిలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎన్‌సీడీసీడీ జిల్లా ప్రోగ్రాం అధికారి కాంతారావునాయక్ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆశాడే కార్యాక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ఎప్పటికప్పుడు ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. వ్యక్తిగతంతోపాటు పరిశరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో పిచ్చిమొక్కలను తొలగించడంతో పాటు మొక్కలను నాటారు. కార్యక్రమంలో డాక్టర్ గోపాల్, వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా సాగిన జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు


సూపర్‌లీగ్‌కు ఎంపికైన జట్లు

నంద్యాల (న్యూటౌన్): పట్టణంలోని శ్రీ రామకృష్ణ కళాశాలల క్రీడా మైదానంలో మంగళవారం జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. సూపర్ లీగ్‌కు బాలుర ప్రీ క్వార్టర్ విభాగంలో రాజస్థాన్ జట్టుపై బీహార్, తెలంగాణ జట్టుపై ఢిల్లీ, ఉత్తరాఖండ్ జట్టుపై కేరళ జట్టు, హర్యానా జట్టుపై ఆంధ్ర ప్రదేశ్ జట్లు విజయం సాధించాయి. బాలికల విభాగంలో తెలంగాణ, ఢిల్లీ, మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్ పంజాబ్, ఆంధ్ర ప్రదేశ్, కేరళ, పశ్చిమ బెంగాల్ జట్లు విజయం సాధించి సూపర్ లీగ్‌కు చేరాయి.

ఆకతాయికి జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): పట్టణానికి చెందిన ఆకతాయికి మంగళవారం సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్ రెడ్డి జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు. వైఎస్సనగర్‌కు చెందిన వెంకటగిరి అశోక్ అయ్యలూరు గ్రామం పెద్దకొట్టాల గ్రామాల క్రాస్‌రోడ్డులో ఓ మహిళపై అసభ్యకరంగా వ్యవహించారు. స్థానికులు పోలీసులకు సమాచారం మేరకు తాలూకా పోలీసులు నిందుతునిపై కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి ఏడురోజులు జైలు శిక్షను విధించినట్లు పోలీసులు వివరించారు.

నాన్ టీచింగ్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఖాళీ పోస్టులకు (నాన్‌టీచింగ్) ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డోన్ పరిధిలోని బేతంచెర్లలో హెడ్‌కుక్, అసిస్టెంట్ కుక్, నైట్ వాచ్‌మెన్, స్వీపర్, ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 15, బనగానపల్లె నియోజకవర్గంలో 13, నందికొట్కూరు నియోజకవర్గంలో 8, పాణ్యంలో 2, నంద్యాల నియోజకవర్గంలో 9, శ్రీశైలం నియోజకవర్గంలో 7 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఈనెల 16వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. 18వ తేదీన అభ్యర్థుల ఎంపిక, 21న కమిటీ అనుమతి, 22న ఎంపిక జాబితా విడుదల చేస్తామని వివరించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాబ్ మేళా

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. జాబ్‌మేళాకు హాజరైన యువతకు డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, జేకేసీ సోమశివారెడ్డి, జేడీఎం అన్సర్, కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పార్వతి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి సూచనలు చేశారు. 165మంది యువతీ, యువకులు హాజరవ్వగా నాలుగు కంపెనీల ప్రతినిధులు 54మందిని ఎంపిక చేసుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ తెలిపారు.

క్రీడా దుస్తుల పంపిణీ

చాగలమర్రి: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మూడు రోజుల శిక్షణ పొందిన హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు మంగళవారం ఫ్రూట్ మర్చంట్ మహబూబ్‌బాషా క్రీడా దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో ట్రైనర్ సురేంద్ర, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

క్రీడాకారుడికి అభినందన

నంద్యాల(న్యూటౌన్): నంద్యాలకు చెందిన అంతర్జాతీయ దివ్యాంగ క్రీడాకారుడు అర్షద్‌ను మంగళవారం రాత్రి రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అభినందించారు. ఇటీవల ప్యారిస్‌లో జరిగిన పారా ఒలింపిక్స్ సైక్లింగ్ పోటీల్లో భారతదేశం తరపున మొదటి సారి పాల్గొన్నారు. డాక్టర్ రవికృష్ణ ప్రోత్సాహంతో శిక్షన పొంది జాతీయ స్థాయిలో పలు పతకాలు సాధించినట్లు క్రీడాకారుడు అర్షద్ తెలిపారు.

ఉష్ణోగ్రతల మార్పు... పిడుగు ముప్పు!

- కాలంతో సంబంధం లేకుండా వర్షాలు
- భయపెడుతున్న ఉరుములు, మెరుపులు
- 5వ తేదీన పిడుగుపాటకు యువకుడు మృతి
- అప్రమత్తతే శరణ్యం అంటున్న డాక్టర్లు


ఆకాశంలో మెరుపు వస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): ప్రస్తుతం వాతావరణంలో మార్పులు అంచనా వేయలేని పరిస్థితి. తీవ్రమైన ఎండలు... అంతలోనే భారీ వర్షాలు. ఓ కాలనీలో వర్షం కురుస్తుంది... పక్కకాలనీలో చినుకు పడని పరిస్థితులు చూస్తున్నాం. వాతావరణంలో వస్తున్న మార్పులతో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్నాయి. విపరీత వాతావరణ పరిస్థితుల్లో ఎప్పుడు ఏ రకం వానలు కురుస్తాయో తెలియని పరిస్థితి. భారీ వర్షాలు కురిస్తే వాటితోనే ఉరుములు, మెరుపులు, పిడుగులు సహజంగానే వస్తాయి. పిడుగులకు బలమైన అయస్కాంత శక్తితో కూడిన విద్యుత్ శక్తి ఉంటుంది. అందుకే మనుషులతో పాటు జంతువులూ చనిపోతాయి. పిడుగుల ప్రభావానికి పచ్చని చెట్లు సైతం కాలిపోతుంటాయి. నంద్యాల జిల్లాలో ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలతో పిడుగులు పడి ప్రాణ, ఆస్తి నష్టం జరిగిన సందర్భాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ నెల 4వ తేదీన (శుక్రవారం)మండల కేంద్రం అవుకులోని మసీదు గోపురంపై పిడుగు పడి పగుళ్లు ఇచ్చిన విషయం తెలిసిందే. అదేవిధగా 5వ తేదీన(శనివారం)తెల్లవారుజామున వెలుగోడు మండల కేంద్రం వద్ద తెలుగుగంగ కట్ట సమీపంలో పిడుగు పడిన శబ్దానికి పక్కనే నిద్రిస్తున్న యువకుడు శివగంగాధర్ మృతి చెందాడు. పిడుగు పడే ప్రాంతాలపై విపత్తుల నిర్వహణ సంస్థ ప్రజలను అప్రమత్తం చేస్తున్నా... నష్టం జరుగుతూనే ఉంది.. అయితే తగిన జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదం నుంచి బయటపడ వచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

పిడుగు అంటే...

చుట్టూ ఉన్న గాలిలో సుమారుగా 30వేల డిగ్రీల సెంటీగ్రేడ్‌ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. అదే మెరుపులా వేడెక్కిన గాలి ఒక్కసారిగా వ్యాకోచం చెందితే పెద్ద శబ్దం వస్తే అదే ఉరుము. ఒక్కోసారి మెరుపుతో కూడిన విద్యుత్ భూమి మీదకు చేరుతుంది. దాన్నే పిడుగు అంటారు. చర్మం జలదరింపునకు గురవుతున్నా దగ్గరలో లోహ వస్తువులు ఊగుతున్నా పిడుగుపాటుకు సంకేతంగా భావించాలి.

మిలియన్ మెగావాట్ల శక్తి...

వర్షాలు పడే సమయంలో బయటకు వెళ్లకపోవడమే ఉత్తమం. ముఖ్యంగా వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలి. ఉరుములు, మెరుపులు వస్తుంటే చెట్లకిందకు, విద్యుత్ టవర్లు, ట్రాన్స్ ఫార్మర్ల సమీపంలోకి వెళ్లకూడదు. మెరుపు లేదా పిడుగు కాంతిని చూసే ప్రయత్నమూ చేయకూడదు. పిడుగుకు కొన్ని మిలియన్ మెగావాట్ల శక్తి ఉంటుందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి.

సమయస్ఫూర్తి అవసరం...

వ్యవసాయ పనులు చేసేటప్పుడు ఉరుములు, మెరుపులు వస్తుంటే పిడుగులు పడతాయని భావించి రైతులు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. వెంటనే సురక్షిత ప్రాంతానికి చేరుకోవాలి. ఒక వేళ వీలు కాకుంటే సమయస్ఫూర్తితో వ్యవహరించి మోకాళ్లపై చేతులు, తల పెట్టి దగ్గరగా ముడుచుకొని కూర్చోవాలి. పిడుగు పడినా అందులోని విద్యుత్ ప్రభావం తక్కువగా ఉండి బతికేందుకు అవకాశాలు ఉంటాయి. ఉరుములు ఉన్నప్పుడు టీవీ, రిఫ్రిజిరేటర్, సెల్‌ఫోన్ వంటి వాటిని వినియోగించక పోవడం ఉత్తమం. ఆరుబయట ఉండడం, స్నానం చేయడం మంచిదికాదు. లోహపు వస్తువుల ద్వారా విద్యుత్ ప్రవహించే అవకాశాలు అధికం.

ఈ జాగ్రత్తలు పాటించాలి..

- సాధారణంగా ఎత్తుగా ఉండే నిర్మాణాలు, ప్రాంతాలపైనే పిడుగులు ఎక్కువగా పడుతుంటాయి. వర్షం కురుస్తున్నప్పుడు ఎత్తయిన చెట్లు, సెల్ టవర్లు, స్తంభాలు, కొండల వద్దకు వెళ్లకూడదు.
- విద్యుత్తు ట్రాన్స్ ఫార్మర్లకు దూరంగా ఉండాలి.
- కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్లు, విద్యుత్ స్టవ్‌లు, ఇతర విద్యుత్తు పరికరాలు ఉపయోగించరాదు.
- ఉరుములతో కూడిన వర్షం వస్తున్నప్పుడు. నీటితో కూడిన పనులు చేయరాదు.
- పిడుగు పడిన సందర్భాల్లో ముఖ్యంగా శరీరంపై కాలిన గాయాలు కావడం, గుండెపోటు రావడం, పిడుగు శబ్దానికి చెవులు కూడా వినిపించక పోవడం జరుగుతుంది. వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

అప్రమత్తత అవసరం



వర్షాలు కురుస్తున్న సమయంలో ఎత్తయిన ప్రదేశాలకు, చెట్ల కిందకు వెళ్లరాదు. పిడుగు పడే అనుమానం ఉంటే బహిరంగ ప్రదేశంలో భూమిపై కూర్చోవాలి. కూర్చున్నాక చెవులు మూసుకోవాలి. ధ్వని శబ్దం గుండెకు చేరకుండా జాగ్రత్తపడాలి. సెల్‌ఫోన్లు వాడకూడదు. ఉరుములు మొదలైతే వీలైనంత త్వరగా ఇళ్లకు చేరుకోవాలి. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా ప్రాణాలకు ముప్పు ఉంటుంది.

–డాక్టర్ అంకిరెడ్డి, ఎంహెచ్‌ఓ, నంద్యాల

పట్టణ సుందరీకరణపై దృష్టి సారించండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల: జిల్లాలోని మున్సిపల్ ప్రాంతాలలో పట్టణ సుందరీకరణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో అన్న క్యాంటీన్లు, 200 రోజుల ప్రణాళిక, ఎస్‌టీపీ ల్యాండ్, పట్టణ సుందరీకరణ, శానిటేషన్, తాగునీటి సరఫరా తదితర అంశాలపై మున్సిపల్ కమిషనర్లతో సమీక్షించారు. నంద్యాల ఆర్డీవో మల్లికార్జున్‌రెడ్డితోపాటు నంద్యాల, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, నందికొట్కూరు, డోన్ మున్సిపల్ కమిషనర్లు నిరంజన్‌రెడ్డి,వెంకట్రామిరెడ్డి, రమేష్ బాబు, బేబీ, ప్రసాద్ గౌడ్, బేతంచెర్ల నగర పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ అన్ని మున్సిపల్ పట్టణ ప్రాంతాలలో ముమ్మర పారిశుద్ధ పనులు చేపట్టడంతో పాటు సురక్షిత మంచినీటిని సరఫరా చేయాలన్నారు. పట్టణ సుందరీకరణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి అందంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వంద రోజుల ప్రణాళికలో చేపట్టి పూర్తి చేసిన పనులన్నీటిని తాను స్వయంగా పరిశీలిస్తానన్నారు. అలాగే 200 రోజుల ప్రణాళిక లక్ష్యాల నివేదికలను తనకు సమర్పించాలని సూచించారు.

నీటి సంఘాల ఎన్నికలు పటిష్టంగా నిర్వహిస్తాం

నంద్యాల: జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల కింద ఉన్న 302 నీటి వినియోగదారుల సంఘాలకు పటిష్టంగా ఎన్నికలు నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ రాజకుమారి జల వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు వివరించారు. మంగళవారం విజయవాడ నుండి రాష్ట్రంలోని పెద్ద, మధ్య, చిన్న తరహా నీటిపారుల కింద ఉన్న నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహించే అంశంపై జిల్లా కలెక్టర్లు, జల వనరుల శాఖ అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పరిధిలో కేసీ కెనాల్ కింద 86, ఎస్ఆర్‌బీసీ కింద 49, తెలుగు కింద ప్రాజెక్టు కింద 47, మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల కింద 120 వెరసి మొత్తం 302 సాగునీటి సంఘాలు ఉన్నట్లు పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టుల కింద ఉన్న 302 నీటి వినియోగదారుల సంఘాలకు పటిష్టంగా ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

శ్రీదుర్గా మాత ఆశీస్సులు అందరికీ ఉండాలి

- మాజీ ఎమ్మెల్యే శిల్పారవి


అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే శిల్పారవి చంద్రకిశోర్‌రెడ్డి

నంద్యాల(అర్బన్): దుర్గా మాత ఆశీస్సులు అందరికీ ఉండాలని కోరుకున్నట్లు నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. దశరా శరన్నవరాత్రి పర్వదిన వేడుకల సందర్భంగా మండలంలోని అయ్యలూరు గ్రామంలో మంగళవారం నూతనంగా ఏర్పాటు చేసిన ఆలయంలో దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ట చేశారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే శిల్పా రవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనతరం అమ్మవారికి వెండి తొడుగును అలంకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీదుర్గా అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొనడం ఎంతో భాగ్యంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బసవేశ్వరరెడ్డి, రవికుమార్‌రెడ్డి, రషీద్, షఫీ, అనిల్‌రెడ్డి, ప్రసాద్, కటారి బాలుడు, పరమేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ప్రజా ఉద్యమం తప్పదు

సాక్షి, నంద్యాల: సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కూటమి నేతలు దాడులకు, బెదిరింపులకు పాల్పడుతుండటంతో త్వరలో ప్రజలే ఉద్యమించేలా ఉన్నారని ఎమ్మెల్సీ ఇసాక్ బాషా అన్నారు. హామీలపై నిలదీస్తారనే భయంతోనే ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్‌ను ఎంచుకుందన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికార పార్టీ ప్రజాప్రతినిధుల అక్రమాలు, దందాలు, బెదిరింపులు, వసూళ్లపై టీడీపీ గెజిట్ పత్రికల్లోనే వరుసగా కథనాలు వస్తున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. దోచుకుని తినేందుకే తమకు అధికారం అప్పగించారన్నట్లుగా అధికార పార్టీ ఎమ్మెల్యేలు అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని రోజూ ఏదో ఒకచోట మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీ జయంతి కానుకగా ప్రభుత్వం నూతన మద్యం పాలసీని ప్రకటించినట్లుందని ఎద్దేవా చేశారు. మంచి విద్య, వైద్యం అందిస్తామని గత సీఎంలు ప్రకటిస్తే సీఎం చంద్రబాబు మాత్రం సరసమైన ధరలకు నాణ్యమైన మద్యం అది కూడా రూ.99 కే క్వార్టర్ మద్యాన్ని ఇస్తున్నట్లు ప్రచారం చేసుకోవడం విచారకరమన్నారు.

వైద్యాధికారిణిపై విచారణ


వైద్యాధికారిణి పి.అజలిని విచారిస్తున్న విచారణ బృందం

చాగలమర్రి: మండల కేంద్రంలోని ప్రభుత్వ పీహెచ్‌పీ వైద్యాధికారిణి పి.అంజలిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో అధికారులు విచారణ చేపట్టారు. వైద్యాధికారిణి అంజలి డీడీఓగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి హెచ్‌డీఎస్ సమావేశం నిర్వహించలేదని, ఆసుపత్రి ఆవరణలోని చెట్లను అధికారుల అనుమతి లేకుండా తొలగించారని, 26 మందికి ఆరోగ్య ఆసరా పథకం డబ్బులు చెల్లించలేదని డీఎంఎహెచ్‌ఓకు ఫిర్యాదులు అందాయి. వారి ఆదేశాల మేరకు మంగళవారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శారదాబాయి, డీబీసీఎస్ వైద్యాధికారిణి మాధవీలత, డీఐఏ వైద్యాధికారిణి ప్రసన్నలక్ష్మితో కూడిన బృందం ఆస్పత్రికి చేరుకుని విచారణ చేపట్టారు. అన్ని విషయాలు ఆరా తీశామని, నివేదికను డీఎంహెచ్‌ఓకు సమర్పిస్తామని త్రిసభ్య కమిటీ సభ్యులు తెలిపారు.

వన్య ప్రాణులను వేటాడొద్దు

రుద్రవరం: వన్య ప్రాణులను వేటాడటం మానుకొని, వాటి సంరక్షణకు పాటుపడాలని అటవీ అధికారులు ప్రజలకు సూచించారు. మండల పరిధిలోని తిప్పారెడ్డిపల్లెలో మంగళవారం అటవీ అధికారులు వన్య ప్రాణి వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫారెస్టర్లు శ్రీనివాసరెడ్డి, రాణెమ్మ మాట్లాడుతూ రిజర్వ్ ఫారెస్టు సరిహద్దుల్లో కొందరు తమ పంట సంరక్షణ కోసం వలలు వేయడం, మరి కొందరు వేటాడటం వంటివి చేయవద్దని చెప్పారు. అలాగే అడవికి నిప్పు పెట్టవద్దని, ఎక్కడ పడితే అక్కడ ఆహార పదార్థాలు వేయవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్‌బీఓలు నరసింహ్మారెడ్డి, సురేంద్రగౌడ్ తదితరులు ఉన్నారు.


వన్యప్రాణుల సంరక్షణ కీలకం

చాగలమర్రి: పర్యావరణ పరిరక్షణకు వన్య ప్రాణుల సంరక్షణ కీలకమని డి.వనిపెంట సెక్షన్ అధికారి టి.రామకృష్ణ అన్నారు. వన్య ప్రాణి సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా చివరిరోజు మంగళవారం పెద్దవంగలి గ్రామంలో వన్యప్రాణులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ వన్య ప్రాణుల నివాసాలను సంరక్షించి వాటి జీవ వైవిధ్యమును పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక బీట్ ఆఫీసర్లు శ్రీమదన్ గోపాల్, శ్రీజంగం శుభాష్, బేస్ క్యాంపు ప్రొటెక్షన్ వాచర్ నరసింహా, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

15న మండల మీట్

దొర్నిపాడు: ఈనెల 15న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సావిత్రి మంగళవారం తెలిపారు. ఎంపీపీ గోపవరం అమర్‌నాథ్‌రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు.

ధనలక్ష్మి అలంకారంలో అమ్మవారు


బాలాజీ కల్యాణ మండపం నందు శ్రీ ధనలక్ష్మి అమ్మవారు


జగజ్జననీ ఆలయంలో రాహుః కాల పూజల్లో పాల్గొన్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): దేవీశరన్నవరాత్రోత్సవాలు నంద్యాల పట్టణంలో భక్తిశ్రద్ధల మధ్య సాగుతున్నాయి. మంగళవారం అమ్మవార్లు ధనలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం దేవాలయాల్లో గణపతిపూజలు, పుణ్యాహవాచనం, నవగ్రహ పూజలు, రాహుః కాల పూజలు, కంకణ దారణలు, స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు, పూలంగిసేవ కార్యక్రమాలు, లలితా సహస్రనామాలు, వేదపారాయణాలు, హోమాలు, గోపూజలు నిర్వహించారు. సాయంత్రం ప్రదోష కాల పూజలు నిర్వహించి ప్రత్యేక మండపాల్లో అమ్మవార్లు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక బాలాజీ కాంప్లెక్స్‌లోని శ్రీకొట్టి సుబ్బమ్మ కల్యాణ మండపంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని రూ.4లక్షల కరెన్సీ నోట్లతో అంకరించారు.


పైనాపిల్స్‌తో శ్రీ కాళికాదేవికి అలంకరణ


శ్రీ అన్నపూర్ణదేవి అలంకారంలో శ్రీవాసవీ మాత


నిమిషాంబదేవి ఆలయంలో ప్రత్యేక అలంకారంలో అమ్మవారు


కోటాసుంకులాపరమేశ్వరి ఆలయంలో శ్రీకృష్ణ రాయబారం బుర్రకథ వినిపిస్తున్న దృశ్యం

లోకజనని.. కరుణ రూపిణి

దొర్నిపాడు/దొర్నిపాడు/ఉయ్యాలవాడ/చాగలమర్రి: దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. అపురూప అలంకరణలతో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తున్నారు. మంగళవారం కన్యకా పరమేశ్వరి అమ్మవారు శ్రీమహాలక్ష్మిగా కొలువుదీరారు. సముద్రాల రమేష్, రామచంద్రయ్య కుటుంబాలు ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అంజనీ ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. రుద్రవరంలోని కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో శరన్నవ రాత్రి ఉత్సవాలు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి రోజుకో అలంకారం గావించి విశేష పూజలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆరవ రోజు మంగళవారం అమ్మవారిని అన్నపూర్ణ దేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉయ్యాలవాడ మండలం ఇంజేడు గ్రామంలో చౌడేశ్వరి దేవి లక్ష్మీదేవి అలంకారంలో, ఉయ్యాలవాడలో మారెమ్మతల్లి మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పై ఆలయాల్లో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. మండల కేంద్రమైన చాగలమర్రి గ్రామంలో వెలసిన కనక్యా పరమేశ్వరీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు మంగళవారం రాత్రి శ్రీభవానిదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ముత్యాలపాడులో అమ్మవారు గజలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులను ఆశీర్వదించారు.


దొర్నిపాడులో.. శ్రీమహాలక్ష్మిగా అమ్మవారు


రుద్రవరంలో అన్నపూర్ణదేవి అలంకారంలో అమ్మవారు


ఉయ్యాలవాడలో మహా లక్ష్మిదేవి అలంకారంలో అమ్మవారు



చాగలమర్రిలో భవానిదేవిగా శ్రీకన్యకాపరమేశ్వరిదేవి


ముత్యాలపాడులో శ్రీగజలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

గోస్పాడు: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఆయాపోస్టులకు దరఖాస్తుచేసుకోవాలని సూపర్ వైజర్ కుమారి తెలిపారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆమె మాట్లాడారు. గోస్పాడు-2లో (ఓసీ), జూలేపల్లె-1లో (ఓసీ) ఖాళీగా ఉన్నాయని, మహిళా అభ్యర్థులు దరఖాస్తుచేసుకోవాలన్నారు. పదవ తరగతి పాసై, 21 నుంచి 35 సంవత్సరాలలోపు ఉండాలన్నారు. దరఖాస్తులను ఈనెల 21వ తేదీలోపు జిల్లా సీడీపీఓ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

దొర్నిపాడు: మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ మంగళవారం తెలిపారు. దొర్నిపాడు-5 కేంద్రంలో బీసీ-బి, వెంకటేశ్వరనగరంలో ఎస్టీకి కేటాయించినట్లు చెప్పారు. పదవ తరగతి తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించి ఉండాలని, అలాగే 18 నుంచి 35ఏళ్ల లోపు ఉండాలన్నారు. ఈనెల 10నుంచి 21 వరకు స్వీకరిస్తారని, పూర్తి చేసిన దరఖాస్తులను ఆళ్లగడ్డలోని సీడీపీఓ కార్యాలయంలో అందజేయాలన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తుల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

చాగలమర్రి: కుష్టు వ్యాధిగ్రస్తుల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని డీఎంహెచ్ శారదాబాయి ఆశ కార్యకర్తలకు సూచించారు. ఆశ డేను సందర్భంగా మంగళవారం స్థానిక పీహెచ్‌సీలోని సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కుష్టు వ్యాధి గ్రస్తులను గుర్తించి వారికి అంగవైకల్యం రాకుండా వైద్య సేవలు అందించాలన్నారు. 19 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వారికి బీసీజీ వ్యాక్సిన్ వేయాలని సూచించారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల నివారణకు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఐఓ ప్రసన్నలక్ష్మి, డీబీసీఎస్ మాధవీలత, ఎంపీహెచ్‌ఓ సీహెచ్‌ఓ రవణమ్మ పాల్గొన్నారు.

ఆస్పత్రి ప్రసవాలను ప్రోత్సహించాలి

శిరివెళ్ల: వైద్యశాలలోనే ప్రసవాలు జరిగే విధంగా ప్రోత్సహించాలని ఫ్యామిలీ డాక్టర్ నోడల్ అధికారి జగదీష్ చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఆశాడే నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అడల్ట్‌బీసీజీ వ్యాక్సినేషన్ వైద్యశాలలో వంద శాతం పూర్తయిందన్నారు. అందుకు సిబ్బందిని అభినందిస్తున్నట్లు తెలిపారు. సీజనల్ వ్యాధుల వ్యాప్తి, నివారణ చర్యలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని, వ్యాధి నివారణకు సత్వరమే స్పందించాలని డాక్టర్‌ను ఆదేశించారు. ప్రజారోగ్యం కోసం ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. ఆరోగ్య సంక్షేమ కార్యక్రమాలని వంద శాతం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు భవ్య, ముఖేష్, సీహెచ్‌ఓ రాంమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులతో ఉజ్వల భవిష్యత్తు

రుద్రవరం: వృత్తి విద్యా కోర్సులతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రుద్రవరం ఏపీ మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. పాఠశాలకు చెందిన పలువురు పదవ తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థులు దసరా సెలవులు అయినప్పటికీ ఒకేషనల్ కార్యక్రమంలో పలు అంశాలపై అవగాహన పొందుతున్నారన్నారు. ఐటీ అండ్ ఐటీఈఎస్ ట్రేడ్‌కు చెందిన 11 మంది విద్యార్థులు ఐటీ రంగంలో రోజువారి కార్యక్రమాలు, నైపుణ్యాలను తెలుసుకునేందుకు గ్రామ సచివాలయం,మీ సేవ కేంద్రాలకు ఆశ్రయిస్తున్నారన్నారు.